క్లుప్తంగా

విద్యార్థుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న చిన్నారులు

జి.సిగడాం: మండలంలో పెంట గ్రామంలోని యూపీ పాఠశాలలో చదువుతున్న చిన్నారులు సోమవారం శ్రమదానం చేశారు. గ్రామ సచివాలయం ముందు మద్దువలస కాలువ వంతెనపై చెత్తాచెదారం తొలగించారు. దీంతో విద్యార్థులను పలువురు అభినందించారు.

బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



యూఎఫ్‌బీయూ నాయకుల ధర్నా

శ్రీకాకుళం అర్బన్: బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్(యూఎఫ్‌బీయూ) జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు కోరారు. యూఎఫ్‌బీయూ పిలుపు మేరకు సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద బ్యాంకు ఉద్యోగులు ధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ధర్నాకు శ్రీకాకుళం రీజియన్ తరపున తాను హాజరైనట్లు తెలిపారు. 5 రోజుల పనిదినాలు అమలు చేయాలని, బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయా లని, ఉద్యోగులపై దాడులను అరికట్టేందుకు ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకత్వం పాల్గొన్నట్లు తెలిపారు.

సంగీత దర్శకుడు మనోడే



నటుడు రామ్ ప్రసాద్‌తో సంగీత దర్శకుడు షణ్ముఖ శ్రీనివాస్

ఎచ్చెర్ల క్యాంపస్: జబర్దస్త్ ఫేమ్ ఆటో రామ్ ప్రసాద్ హీరోగా నటించిన 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్' సినిమా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సినిమాకు డైరెక్టర్‌గా గంగా సప్తశిఖర వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం సమకూర్చింది మన జిల్లాకు చెందిన వ్యక్తి కావడం గమనార్హం. ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామానికి చెందిన పైడి షణ్ముఖ్ శ్రీనివాస్ ఈ చిత్రానికి సంగీతం అందజేశారు. ఆయన గతంలో పలు చిత్రాలు, ఓటీటీ ప్లాట్‌ఫారం వెబ్ సిరీస్‌లకు సంగీతం సమకూర్చారు. ఈ సినిమాతో పాటు మరో రెండు సినిమాలకు సంగీతం అందించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేసి, సంగీతంపై ఆసక్తితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం విడిచిపెట్టి సినిమా ఇండస్ట్రీకి వెళ్లారు. భవిష్యత్‌లో ఉత్తమ సంగీత దర్శకుడు కావటం తన లక్ష్యంగా వివరించారు.

తప్పిన ప్రమాదం



స్వల్పంగా దెబ్బతిన్న కారు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై ఫరీదుపేట కూడలి కొయ్యరాళ్ల వద్ద సంతబొమ్మాళి మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు పొందల తులసమ్మ కుమారుడు రామకృష్ణ కారుని వెనుకనుంచి వచ్చిన లారీ స్వల్పంగా ఢీకొంది. దీంతో వారు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి కారు, లారీలను స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నిజమైన శిష్టకరణాలను ప్రభుత్వం గుర్తించాలి



శిష్టకరణాల ఐక్యత చాటుతున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిజమైన శిష్టకరణాలను ప్రభుత్వం గుర్తించాలని, కుల సంక్షేమానికి పాటుపడుతున్న వ్యక్తులకు కార్పొరేషన్ పదవులిచ్చి సేవలు మెరుగుపరచాలని రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు కోరారు. నగరంలోని ఎన్జీవో హోమ్‌లో శిష్టకరణాల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కొంతమంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చివారు ఇక్కడ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారన్నారు. కులంపై స్వచ్ఛత లేని వ్యక్తులకు పోస్టులు కట్టబెట్టవద్దన్నారు. ఓబీసీ సాధన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తూ తమని ఓబీసీ జాబితాలో చేర్చాలని విన్నవించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు బీఆర్ఎం పాత్రో, డబ్బీరు శ్రీనివాసరావు, బలివాడ హరిబాబు, ప్రభాకరదాసు, పావని, సదాశివుని లక్ష్మణరావు, డాక్టర్ శ్రీనివాసపట్నాయక్, సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా..!

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు



పేరుకుపోయిన పాలిథిన్ వ్యర్థాలు

ఎచ్చెర్ల: ప్లాస్టిక్ అనేది పర్యావరణాన్ని పట్టిపీడిస్తున్న భూతం. ఏ ప్రాంతంలో చూసినా ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. ప్రధానంగా హోటళ్లు, చికెన్ సెంటర్లు, చిన్న, చిన్న దుకాణాలతో పాటు సంతల్లో వీటి వాడకం పరిపాటిగా మారింది. ఈ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను వినియోగించిన అనంతరం ఎక్కడబడితే అక్కడ పారేయడంతో, అవి భూమిలో కలవకుండా పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. వీటి వినియోగం నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా పర్యావరణానికి రానున్న రోజుల్లో ముప్పు తప్పదని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పించాలి

ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగంపై ప్రజలకు అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలి. వీటివల్ల కలిగే అనర్థాలపై అతి తక్కువ మందికే తెలియడంతో వినియోగం తగ్గడం లేదు. తక్కువ ధరకు పాలిథిన్ కవర్లు వస్తుండడంతో వీటి వల్ల కలిగే నష్టాన్ని గుర్తించడం లేదు.

– వంచిరెడ్డి కృష్ణ, చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, ఎచ్చెర్ల

నిబంధనలు అమలు చేయాలి

ప్లాస్టిక్ నివారణకు తీసుకొచ్చిన నిబంధనలు పక్కాగా అమలు చేయాలి. పాలిథిన్ విక్రయాలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలి. లేకుంటే వీటి వినియోగం పెరిగి పర్యావరణం కలుషితమై ప్రజలు అనారోగ్యాల బారినపడతారు.

– రెడ్డి గోపాల్ చిన్నయ్యపేట, లావేరు మండలం

అమలుకాని నిబంధనలు

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 40 మైక్రాన్ల మందం కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలి. దీనికి విరుద్ధంగా ప్లాస్టిక్ వినియోగించే వారిపై కేసులు నమోదు చేయాలనే నిబంధన ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో వీటికి ప్రత్యామ్నాయంగా పేపర్‌తో గ్లాసులు, కవర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవి భూమిలో కలవడం వలన ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిసినా వాటిని ఎవరూ వినియోగించడంలేదు. వీటి ధర ఎక్కువగా ఉండడంతో తక్కువ ధరకు వచ్చే పాలిథిన్ వైపే వ్యాపారులు మొగ్గ చూపుతున్నారు. దీంతో వినియోగదారులు కూడా వీటితోనే సరుకులు తీసుకెళ్తున్నారు.

ప్రకటనలకే పరిమితం

ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలపై నిఘా ఏర్పాటు చేశామని, విక్రయిస్తే చర్యలు తప్పవని అధికారులు చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. వీటిని విక్రయించే వారిపై అధికారులు ఎక్కడా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో నిత్యం ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతోంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కూటమి సర్కార్‌కు ఝలక్

- ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కూటమి ప్రభుత్వానికి ఉపాధ్యాయులు షాకిచ్చారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా.. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం, కనీసం ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఉద్యోగులను పట్టించుకుపోవడాన్ని జీర్ణించుకోలేకపోయారు. కూటమి ప్రభుత్వం మద్దతిచ్చిన ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకి వ్యతిరేకంగా ఓటెత్తారు. దీంతో పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనువాసులనాయుడుని గెలిపించుకున్నారు. రఘు వర్మ ఓటమిని అంగీకరించారు. అధికార పార్టీ మద్దతు ప్రకటించకుండా ఉంటే గెలిచేవాడినేమోనని తన సహచరుల వద్ద వాపోయినట్లు ప్రచారం జరుగుతోంది.

తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకొని...

అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే చంద్రబాబు సారథ్యంలోని కూటమి సర్కారుపై అన్ని వర్గాల్లోనూ తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీగా బరిలో ఉన్న పాకలపాటి రఘువర్మకు అధికార కూటమి ప్రభుత్వం మద్దతు ప్రకటించడం, ముఖ్య నాయకులు, మంత్రులు, ఎమ్మెల్సీలు ప్రచారంలో పాల్గొనడంతో అధికార కూటమిపై గుర్రుగా ఉన్న ఉపాధ్యాయ లోకం ఏకమైంది. కూటమి పార్టీకి 2024 సార్వత్రిక ఎన్నికల్లో అవకాశం ఇచ్చి మోసపోయామని గుర్తించిన వెంటనే తేరుకున్నారు. ఎన్నికల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులకు కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు వార్నింగ్‌లు ఇవ్వడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటివి జీర్ణించుకోలేని గురువులు సరైన సమయంలో సరైనవిధంగా బుద్ధి చెప్పారు. మొత్తం మీద ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులనాయుడు విజయం సాధించడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రతినిధులు, టీచర్లు, ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్పీని కలిసిన ప్రొహిబిషనరీ ఎస్‌ఐలు



ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో ప్రొహిబిషనరీ ఎస్‌ఐలు

శ్రీకాకుళం క్రైమ్: విశాఖ రేంజి కార్యాలయం నుంచి జిల్లాకు ఐదుగురు ప్రొహిబిషనరీ ఎస్‌ఐలను కేటాయిస్తూ డీఐజీ గోపినాథ్ జెట్టి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అనంతపురం జిల్లా పోలీసు శిక్షణా కళాశాలలో శిక్షణ పూర్తి చేసిన వి.హేమంత్‌కుమార్, టి.వెంకటేష్, ఎస్.శ్రీనివాస్, బి.మోహిని, కె.ప్రేమలతాదేవిలు నేరుగా విశాఖ డీఐజీ వద్ద రిపోర్టు అయ్యారు. అనంతరం మన జిల్లాకు కేటాయించడంతో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారితో మాట్లాడుతూ విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. గ్రేహౌండ్స్‌లో కొంతకాలం శిక్షణ పొందాక జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందని వెల్లడించారు.

వ్యాస రచన పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు వ్యాస రచన పోటీలు సోమవారం నిర్వహించారు. కళాశాల సెమినార్ హాల్‌లో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి.త్రినేత్రి ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్ కె.లక్ష్మి పర్యవేక్షణలో మహిళా సాధికరత, హక్కులు, సమానత్వం అంశాలపై వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, పి.శంకర్‌నారాయణ, జ్యోతిలక్ష్మి, ఏఎస్‌ఐ ఎం.విజయ్‌కుమార్, హెచ్‌సీ లక్ష్మణరావు, కానిస్టేబుల్స్ జి.అలివేలు, ఎం.అనురాధ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీకాకుళం వన్ టౌన్ ఎస్‌ఐ హరికృష్ణ ఆధ్వర్యంలో కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో సైతం మహిళా సాధికారతపై వ్యాసరచన పోటీలు చేపట్టారు.

గార: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారిత–భద్రత అనే అంశంపై సోమవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు బాల కార్మిక చట్టాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

సంక్షిప్తంగా..

పరామర్శ



రమణమూర్తితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జి.సిగడాం: ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు, గొర్లెపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న దవళపేట గ్రామానికి చెందిన బొడ్డేపల్లి రమణమూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు పిన్నింటి సాయికుమార్, మాజీ బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం సర్పంచ్ వడిశ మహేశ్వరరావు, ఉప సర్పంచ్ పేడాడ శ్రీనివాసరావు, మాజీ డైరెక్టర్ పేడాడ శ్యామలరావులు ఆయనను సోమవారం పరామర్శించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ 30 రోజుల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా యువత అర్హులుగా చెప్పారు. శిక్షణలో ఉచితంగా భోజనం, వసతి అందించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్హత ఉండి 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు అర్హులుగా చెప్పారు. శిక్షణలో ఫొటో ఎడిటింగ్, వీడియో మిక్సింగ్, డ్రోన్ ఆపరేటింగ్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 95534 10809, 79933 40407 నంబర్లను సంప్రదించాలన్నారు.

అన్ని విభాగాలు బలోపేతం కావాలి

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీలో అన్ని విభాగాలు బలోపేతం కావాలని బీఆర్‌ఏయూ వీసీ కె.ఆర్.రజిని ఆకాంక్షించారు. నాక్ మెరుగైన గ్రేడ్ సాధించే భవిష్యత్ ప్రణాళిక సమావేశం సోమవారం నిర్వహించారు. నాక్ మంచి గ్రేడ్ ఇస్తే మెరుగైన నిధులు వస్తాయన్నారు. సమావేశంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.

కలప స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి అనుకొని కింతలిమిల్లు సమీపంలోని తోటలో అక్రమంగా నిల్వ చేసిన టేకు కలపను అటవీ శాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కలప ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎవరు తీసుకొచ్చారు అన్న అంశంపై విచారణ చేస్తున్నారు.

8న జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సబ్ జూనియర్స్ బాలురు, బాలికల జట్ల ఎంపికలు ఈనెల 8వ తేదీన జరగనున్నాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ శ్రీకాకుళం ఛైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్ష, కార్యదర్శులు నక్క కృష్ణారావు, సాదు ముసలినాయుడులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కాలనీ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం సమీపంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మొదలవుతాయన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 55 కేజీల్లోపు బరువు ఉండాలని స్పష్టం చేశారు. ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను మార్చి 14 నుంచి 16వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సబ్–జూనియర్స్ కబడ్డీ ఛాంపియన్‌షిప్–2025 పోటీలకు పంపించనున్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని సంఘ నాయకులు సూచించారు. మరిన్ని వివరాలకు 94419 14214 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం అర్బన్: నడక ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆనందంగా జీవించవచ్చని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 గవర్నర్ కొంక్యాన మురళీధర్ అన్నారు. నగరంలోని డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యాలయంలో వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ గవర్నర్ మురళీధర్ మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ ఫెలోషిప్ (ఎంజీఎఫ్)లో సీనియర్ సభ్యులు చేరాలని, తద్వారా వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ దేశ విదేశాల్లో మరిన్ని సేవలను విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. వాకర్స్ పూర్వపు గవర్నర్లు పీజీ గుప్త, సత్యనారాయణ, డిప్యూటీ గవర్నర్ సుగంధం సంజీవరావు, కోశాధికారి బసవరాజు, వాకర్స్ ప్రతినిధులు కొంక్యాన వేణుగోపాల్, ఎస్.జోగినాయుడు, మారుతీ వాకర్స్ నూతన అధ్యక్షుడు పొట్నూరు నాగేశ్వరరావు, జేసీస్ అధ్యక్షురాలు తమ్మినేని ఉషారాణి తదితరులు ప్రసంగించారు. అనంతరం వాకర్స్ గవర్నర్ మురళీధర్ చేతులమీదుగా మారుతి వాకర్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది.

ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపజేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకే వర్తింపజేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు, జిల్లా సహాధ్యక్షుడు నెమలిపురి విష్ణుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. దీనివలన ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమై విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు.

పూసర్లపాడులో సిరిమానోత్సవం నేడు



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి ధర్మాన

గార: మండలంలోని పూసర్లపాడు గ్రామ దేవత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం నుంచి సిరిమానోత్సవం జరుగుతుందని గ్రామ పెద్దలు, నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు దశాబ్దాల తర్వాత జరిగే గ్రామదేవత (పిట్టాలమ్మ తల్లి) సిరిమానోత్సవంలో భాగంగా ఘటాల ఊరేగింపు, సిరిమాను తిరువీధి జరుగుతుందన్నారు. కాగా అమ్మవారిని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనతో పాటు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఏదీ చిత్తశుద్ధి..?



శ్రీకాకుళం నగరంలో ఎక్కడికక్కడే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్త ఎక్కువ రోజులు నిల్వ ఉండిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లి అటువైపుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త ఉండడంతో ఆవులు, కుక్కలు అక్కడకి చేరి మరింత చిందరవందర చేస్తున్నాయి. ఈ చెత్త తిని పశువులు అనారోగ్యాలపాలవుతున్నాయి. దీంతో అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

సేంద్రియ కూరగాయల అమ్మకం



ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో ఎచ్చెర్ల ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సాగు చేసిన కూరగాయలను రైతులు సోమవారం అమ్మకాలు చేపట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బంది కొనుగోలు చేశారు. ఎటువంటి పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడకుండా సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు.

- ఎచ్చెర్ల క్యాంపస్

డ్రోన్ నిఘా



అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టలో భాగంగా జిల్లాకేంద్రంలోని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో పొట్టి శ్రీరాములు మార్కెట్, కంపోస్టు కాలనీ, దమ్మలవీధి, గుడివీధి, డచ్‌బంగ్లా, నాగావళి నదీ పరీవాహక నిర్మానుష్య ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా సోమవారం ఎగురవేశారు. గంజాయి నిర్మూలన, బహిరంగ మద్యం సేవించడం, పేకాట, ఈవ్ టీజింగ్ అరికట్టే భాగంలోనే డ్రోన్ నిఘా పెట్టినట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు.

- శ్రీకాకుళం క్రైమ్

మున్సిపల్ కార్మికుల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు ధ్వజమెత్తారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల్లో మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సంక్షేమంపై చర్చించకపోవడం దారుణమన్నారు. అసెంబ్లీ సమావేశాలను నిరసిస్తూ మార్చి 11న విజయవాడలోని ధర్నా చౌక్‌లో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 6న రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై ఆప్కాస్ రద్దుచేసి, రెండు బడా కంపెనీలకు నిర్వహణ అప్పగిస్తున్నట్లు ప్రకటించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, మున్సిపల్ యూనియన్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణి, గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, అధ్యక్షుడు కె.వేణుగోపాల్, జె.గురుమూర్తి, ఆర్.గణేష్, ఎస్.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలు ఎదుర్కోవాలి



మాట్లాడుతున్న రాధాకృష్ణ

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు ఇంటర్వ్యూలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని జేసీఐ జోన్ ట్రైనర్ జేఎఫ్ఎఫ్ రాధాకృష్ణ అన్నారు. జూనియర్ చాంబర్ ఆఫ్ శ్రీకాకుళం మెయిన్(జేసీఐ) ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణంగా ఇంటర్వ్యూల్లో అభ్యర్థుల ఆలోచన విధానం, వర్కింగ్ స్కిల్స్, మెంటల్ ఎబిలిటీతో పాటు పర్సనల్ లైఫ్‌కు సంబంధించిన ప్రశ్నలు కూడా అడుగుతారన్నారు. రిక్రూటర్స్ అడిగే ప్రశ్నలకు ఎలా సమాధానం చెప్తే ఉద్యోగం వచ్చే అవకాశాలు పెరుగుతాయో వివరించారు. ఎదుటివారు అడిగే ప్రశ్నలకు మనం చెప్పే సమాధానంలో స్పష్టత ఉండాలన్నారు. అలాగే కుర్చీలో కూర్చునే విధానం సైతం బాగుండాలని స్పష్టం చేశారు. జేసీఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షుడు కూన అనిల్ కుమార్ మాట్లాడుతూ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జోన్ కో–ఆర్డినేటర్ జేసీ వరలక్ష్మి, సభ్యులు జేసీ ఐ.లావణ్య, జేసీ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పూజలు నిర్వహిస్తున్న చిన్న జీయర్ స్వామి, చిత్రంలో సూర శ్రీను

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ప్రముఖ సామాజిక కార్యకర్త, వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని క్రిస్టల్ ప్యాలెస్‌కు సోమవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైందవ ధర్మాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎందరో వచ్చి కుంభమేళాలో స్నానాలు ఆచరించడం శుభ పరిణామమని పేర్కొన్నారు.

జరిమానాల మోత



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: నగర పరిధిలో నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు వరుసగా రెండోరోజూ ట్రాఫిక్ పోలీసులు జరిమానాల మోత మోగించారు. ఏకంగా 120 కేసులు నమోదు చేసి రూ.80 వేల జరిమానా విధించారు. వీటిలో మూడు లైసెన్సులు లేని వాహనదారులకు రూ.30 వేల జరిమానా, హెల్మెట్ ధరించని 8 మందికి రూ.8 వేల జరిమానా విధించారు. ముందుగా ఏడురోడ్ల కూడలిలో హెల్మెట్ ధారణపై ట్రాఫిక్ సీఐ నాగరాజు వాహనదారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ నాగరాజు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నామన్నారు.